# తలాడించే బొమ్మ

చిన్న పిల్లలు ఆడుకుంటుంటే ఎంతో ముచ్చట వేస్తుంది. వాళ్ళ నవ్వులూ, కేరింతలూ, కలివిడీ, ఒకళ్ళ నొకళ్ళు బెదిరించుకోవడాలూ, బతిమిలాడడాలూ, చిన్న చిన్న కొట్లాటలూ, రాజీలూ, జట్లు జట్లుగా ఆటలూ, పెద్దవాళ్ళ సంఘ జీవితానికి పూర్వరంగంగా కనిపిస్తాయి. ఎప్పుడూ క్లాసు పుస్తకాలూ, అమ్మ కొంగులూ, నాన్న వేళ్ళూ, తాత భుజాలూ, అవ్వ నడుములూ పట్టుకొని వేళ్ళాడే వాళ్ళంటే నాకు చిరాకు, అసహ్యం. భావిజీవితానికి పునాది బాల్యంలోని ఆటలూ, స్నేహాలూ.

ఎనిమిదేళ్ళ మా చేతు గాడితో సహా, నలుగురు పిల్లలు దేశవాళీ క్రికెట్ చిట్లాకట్టె మా ఇంటి కెదురుగా వుండే ఖాళీ స్థలంలో ఆడడం మా కిటికీలోంచి చూస్తుంటే నాకు ఆనందంగా వుంది. మా చిన్ని, వాళ్ళమ్మ మీనాక్షితో ఎవరి ఇంటికో వెళ్ళి వుంటుంది. చిన్ని ఆడపిల్ల. ఆడుకునే స్వతంత్రం లేదు. వాతావరణమూ లేదు. అమ్మ వెంట దూడలాగా పోవలసిందే – స్కూలు టయ్యాల్లో తప్ప.

ఆట ఆగింది. చేతుగాడేదో స్నేహితుల్తో గొడవ పడుతున్నట్లుంది. సరిగ్గా అదే సమయంలో మా ఆవూ దూడ రోడ్డుమీద – అదే మా మీనాక్షి, చిన్ని, మీనాక్షి చేతును పిలవడం కన్పిస్తోంది. వాడు మొరాయిస్తున్నాడు. పిల్లలు ఆమె చుట్టూ చేరారు. వాడిని లాక్కుంటూ వస్తోంది – వాళ్ళకేదో నచ్చచెప్పి.

ఏమీ చూడనట్లు నా గదిలో కూచుని చేతి కందిన పుస్తకం తిరగవేస్తున్నా. మీనాక్షి నా గదిలోకి చేతును లాక్కొని వచ్చింది. వాడు గింజుకుంటున్నాడు.

"అయ్యో! బృహదీశ్వరా!" అంటూ కుర్చీలో కూర్చొని తలపట్టుకుంది మీనాక్షి. నిజం చెప్పొద్దూ, నాకేదో సమస్య వచ్చి పడిందనుకున్నాను. 'అయ్యో బృహదీశ్వరా', అని మీనాక్షి అంటే నాకు భయం. మీనాక్షి నన్ను తంజావూరు బృహదీశ్వరుని సాక్షిగా ప్రేమించి పెళ్ళి చేసుకుంది. బృహదీశ్వరుడు నమ్మిన దైవం మరి.

నేను మీనాక్షి వైపు ప్రశ్నార్థకంగా చూశాను.

"మీ అలుసు చూసుకొని చైతన్య పాడైపోతున్నాడు," అంది మీనాక్షి.

"ఏం చేశాడు?" అన్నా యథాలాపంగా.

"నా నోటితోనే చెప్పమంటారా?" మీనాక్షి నాటకీయంగా అని ఆగింది.

పితూరీలను పిల్లల ముందు చర్చించడం నాకిష్టం లేదు. పిల్లలిద్దరికీ నచ్చచెప్పి పక్కగదిలోకి పంపించాను. పంపాక "ఇప్పుడు చెప్పు" అన్నా మీనాక్షితో.

మీనాక్షి నా మీదికి ఇంతెత్తు ఎగిరింది:

"ఏం చెప్పమంటారు? చెడ్డ చెడ్డ తిట్లు నేర్చుకున్నాడు చేతు. భక్తి లేదు. భయం లేదు. మా ఇంట్లో నే నింత వరకొక్క చెడ్డమాట వినలేదు ఎవరినోటా. దేవుడూ, దైవం అనకపోతే ఇట్లాగే ఉంటుంది."

"శాస్త్రం మాట్లాడక జరిగింది చెప్పు," అన్నా నవ్వుతూ. మీనాక్షి రెచ్చిపోయింది:

"అదేదో ఆట ఆడుకుంటూ పక్కింటి బాబును చెడ్డ తిట్టు తిట్టాడు. నిన్న మన చిన్నిని తిట్టాడు. మొన్న స్కూల్లో ఎవర్నో తిట్టినట్లు చిన్ని చెప్పింది."

చిన్నతనంలో నేను రకరకాల స్నేహితుల దగ్గర నుంచి నేర్చుకున్న తిట్లన్నీ స్మృతికి వచ్చాయి. కుతూహలంగా అడిగాను: "ఏం తిట్లు తిట్టాడు?" అని.

మీనాక్షికి చాలా కోపం వచ్చింది:

"మన పనిమనిషి లాగా నా నోటితో అనాలా?" అంది.

నా మనస్సు చివుక్కుమంది:

"మధ్యన పనిమనిషి పేరెందుకు?" అన్నా.

"వాళ్ళకు నీతీజాతి వుండదు కాబట్టి" అంది, నేను ప్రేమించి పెళ్ళాడిన మీన.

కోపం తమాయించుకొని అన్నాను:

"నా చిన్నతనంలో నేను నేర్చుకున్న తిట్లన్నీ నీతీ జాతీ వుండేవాళ్ళ దగ్గర నుంచి నేర్చుకున్నవే. ఆ గొడవెందుకు ? అసలు సమస్య చెప్పు."

ఏమనుకుందో ఏమో మీనాక్షి గొంతు తగ్గించి నచ్చచెప్పే ధోరణిలో అంది:

"రామూ! నువ్వుపట్టించుకోవు. ఏమైనా అంటే పిల్లలు నలుగురిలో కలిసి మెలిసి తిరగడం మంచిదంటావు. ఈ సెలవుల్లో చైతన్య ప్రవర్తన చూస్తున్నా. చాలా తిట్లు నేర్చుకున్నాడు. తిరుగుళ్ళు నేర్చుకున్నాడు. పెద్దవాళ్ళంటే లక్ష్యం లేదు. నీతో చెప్పి లాభంలేదని మా అప్పకు ఉత్తరం రాశా. తాను పోయిన సెలవుల్లోనే చేతును గమనించాడట. స్కూళ్ళలో నీతి, మతం, దేవుడు, భయం, భక్తి - వీటిని గురించి చెప్పకపోవడం వల్లనే పిల్లలు పాడై పోతున్నారని మా అప్ప రాశాడు. ఎక్కడైనా దూరంగా మంచి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించమని రాశాడు-కొన్ని అడ్రసులు పంపాడు. ఈమధ్య నేను కూడా వాటి వివరాలు తెనుక్కున్నా..."

-మీనాక్షి ఆగి నా సమాధానం కోసమన్నట్లు నా వైపు చూసింది.

తెలుగు రక్తముందంటూ, తమిళున్నని చెప్పుకునే మా మామగారు తమ సంప్రదాయ వారసత్వ బలంతో కూతురుకు ఇంగ్లీషులో ఏం రాసి ఉంటాడో నా ఊహకు అందని విషయం కాదు. తంజావూరు బృహదీశ్వరాలయం ఆవరణలోకి ప్రవేశించి, గర్భగుడిలోకి రమ్మంటే తిరస్కరించిన నన్ను చూసి "నీ నమ్మకాలు నీవి, నా నమ్మకాలు నావి, నీ ప్రేమ నాది, నువ్వా శిల్పాల్లోని శ్రమచూడు, నేను దేవుడిలో ప్రేమ చూస్తా" అన్న మీనాక్షి, తండ్రికి ఏం రాసి ఉంటుందో నా బుద్ధికి తట్టని సంగతి కాదు. బృహదీశ్వరాలయం ముందు రోడ్డుకు ఎడమవైపున్న షాపుల్లో దొరికే మట్టిబొమ్మ, కూచో బెడితే కింద పడకుండా తలాడించే బొమ్మ- మీనాక్షి కోరిక మీదట ఇచ్చిన నా తొలి ప్రేమకానుక 'తలయాట్టు బొమ్మై "స్మృతికి వచ్చింది. తెరలు తెరలుగా నవ్వొచ్చింది. నవ్వుతూ తలాడించాను. తలాడిస్తూ నవ్వాను, ఎదురుగా బొమ్మల అల్మారలోని అదే- ఆ బొమ్మని చూస్తూ.

మీనాక్షి ఇబ్బందిగా నవ్వుతూ అంది: "తీరిగ్గా కూర్చుని ఊగుతూ నవ్వేందుకేముంది? నెల్లూరు దగ్గర్లో వుండే సచ్చీల విద్యానికేతన్‌లో సెలవుల తర్వాత చేతును చేర్చాలని నిశ్చయానికొచ్చా. నెలకు మూడు వందలు మనకు కష్టం కాదు- మనిద్దరి సంపాదనతో... చిన్నికి నా బుద్ధులు. చేతుకు నీ బుద్ధులు."

నేను తలాడించాను. ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మీనాక్షి నిర్ణయ శక్తి, పర్యవసానాలూ నాకు అనుభవంలోనివే. లేకపోతే తమ కులానికి సంబంధించని నన్ను ప్రేమించక పోయేది. పెద్దవాళ్ళను, తన వాళ్ళను ఎదిరించి పెళ్ళి చేసుకోక పోయేది.

ఇటువంటి సందర్భాలల్లో తర్కం పనికిరాదు. అనుభవం తప్పదు. చివరి ప్రయత్నంగా, చూద్దాం లెమ్మని, ఆ తర్వాత సచ్చీల విద్యానికేతన్ గురించి నాకు తెలిసిన విషయాలు చెప్పాను:

"అక్కడ సంఘ జీవితం పేరుతో సంఘానికి పనికిరాని వ్యక్తుల్ని తయారు చేస్తారు..."

మీనాక్షి నేను చెప్పినవి నమ్మలేదు. తమ్ముడిని పిలిపించుకుంది. చేతును సచ్చీల విద్యానికేతన్‌లో చేర్పించింది. చేరేముందు వాళ్ళ మామతో వాడు వెళ్తున్నపుడు చూసిన చూపు నేను జీవితాంతం మరచిపోలేను. నా చిన్నతనంలో జీవిత ఖైదు పడిన మా బంధువు చూపులు ఆ క్షణంలో జ్ఞాపకం వచ్చాయి.

సచ్చీల విద్యానికేతన్ నుంచి వస్తున్న ప్రోగ్రెస్ కార్డులను చూసి మీనాక్షి తెగ పొంగిపోయింది. ఆ ఏడాది వేసవి సెలవులకు చేతు వచ్చాడు. చేతులో వెనుకటి చైతన్యంలేదు. బయటకు వెళ్ళి ఆడుకునేవాడు కాదు. ఎప్పుడూ ఇంట్లోనే. వాడి స్నానాలూ, ధ్యానాలు, చదువూ చూసి, ముఖ్యంగా శ్లోకాలు బిగ్గరగా దేవుడి పటం ముందు కూర్చొని వల్లించడం చూసి భక్తుల కథలూ, యోగుల కథలూ — ఆ రకం బాల సాహిత్యం- చదవడం చూసి నిజంగానే నాకు మతి పోయింది. నాకైతే భయం పట్టుకుంది, చేతు ఏ బాల సన్యాసో అయిపోడు కదా అని. శంకరాచార్యుడి తల్లి పడ్డంత ఆనందం మీనాక్షి పడినట్లు కన్పించింది నాకు. చాటుగా నాతో అంది కూడా :

"చూడు రామూ ! ఒక సంవత్సరంలో ఎంతమార్పో ! ఈ నెల రోజుల్లో చేతు ఒక్క చెడ్డమాట నోటితో అనలేదు. మా నాన్న చెప్పేది నిజమే. మత దృష్టివుంటేనే పిల్లలు బాగుపడతారు."

మీనాక్షితో నేను వాదించదలుచుకోలేదు. తల ఊపాను. నా అభిప్రాయాలు ఆమెకు తెలుసు. వాటి మీద తాను విజయం సాధించినట్లు రుజువు చూపుతోంది. మనిషి ద్వారా చూపే రుజువు జడం కాదు.

చేతుకు పదో ఏడు వచ్చింది. ఆరో క్లాసు కొచ్చాడు. సెలవులకు ఈ మారొచ్చినపుడు మునుపటి లాగా స్నానాలూ, ధ్యానాలూ, శ్లోకాలూ, బాలభక్త కథలూ మా ఇంట్లో లేవు. రోజు రోజుకు లోపలికి ముడుచుకపోతున్నట్లు కన్పించాడు చేతు. కిటికీలోంచి మా ఇంటి ఎదురు ఖాళీ స్థలంలో జరిగే పిల్లల ఆటలను

గంటలకొద్దీ చూస్తూ గడుపుతాడు. మీనాక్షి విసుక్కున్నా, కసురుకున్నా, 'అయ్యో బృహదీశ్వరా' అంటూ వాపోయినా ఒక్కమాట బదులు చెప్పడు. బొమ్మల అల్మారాలోని 'తలయాట్టు బొమ్మ'ని-మా దంపతుల ప్రేమచిహ్నాన్ని - ముందేసుకుని వేలితో కదిలిస్తూ ఊరికే దానివైపు చూస్తూ కూర్చుంటాడు. "చేతు ఏదోఅయిపోతున్నాడ"ని మీనాక్షి నాతో రెండుసార్లు ఏడ్చి చెప్పింది. ముఖ్యంగా తిండి మీద ధ్యాస లేకపోవడం చూసి.

చేతు ప్రవర్తన నాకు కొంతవరకు అర్థమైంది. వాడికి సెలవులు పూర్తి కావస్తున్నాయి. వాడేదో దాస్తున్నాడు. చిన్నితో అసలు మాట్లాడటం మానివేశాడు. చూద్దాం లెమ్మనుకున్నాను.

రెండు రోజుల్లో చేతు తిరిగి సచ్చీల విద్యా నికేతన్ వెళ్ళిపోవాలి. ఆ రోజు ఆదివారం. నాకు యూనివర్శిటీలో పని పడింది. మంచి చిన్న పిల్లల ఫిల్ము వుందని మిత్రులంటే బలవంతం చేసి మీనాక్షిని పిల్లలిద్దర్ని తీసుకొని వెళ్ళమన్నా - ఫిల్ము సొసైటీ టికెట్లు ఇచ్చి.

సాయంత్రం ఇంటికి వచ్చాను. చేతు చాలా ఉత్సాహంగా కన్పించాడు. మీనాక్షిని అడిగా: "ఫిల్ము ఎట్లా వుంది ?" అని.

"బాగుంది. చేతుకు బాగా నచ్చినట్లుంది," అంది మీనాక్షి.

"ఏమైనా మాట్లాడాడా ?" అన్నాడు.

"లేదు," అంది చాలా దిగులుగా ముఖం పక్కకు తిప్పుకొని.

"నే నడుగుతాలే మీనా !" అన్నాను.

రాత్రి భోజనాలయ్యాక చేతును దగ్గరికి పిలిచాను మీనాక్షి పక్కగదిలో చిన్నకి ఏదో గౌను కుట్టుకుంటోంది.

"సినిమా ఎట్లా వుంది ?" అని అడిగా చేతును.

"చాలా బాగుంది," అన్నాడు చేతు.

"ఏం కథ ?" అని అడుగుదామనుకునే లోపలే చేతు అన్నాడు :

"నాన్నా ! సినిమాలో నీగ్రో అబ్బాయిని ఆ తెల్లపిల్లలు ఎంత ప్రేమగా చూశారో. అందరూ కలిసి తోటల్లో, అడవుల్లో ఎంత బాగా ఆడుకున్నారనుకున్నావు. మా స్కూల్లో గురుదేవుడూ చెడ్డవాడే. మా టీచర్లూ అంతే. ఎవరితోనంటే వారితో కలవనీరు, మాట్లాడనీరు, ఆట్లాడుకోనీరు, అన్నీ వాళ్ళు చెప్పినట్లే చేయాలి. లేకపోతే బెదిరిస్తారు. తిడతారు. ఎదురు ప్రశ్న వేస్తే కొడతారు. అన్నం పెట్టరు. వాళ్ళు అమ్మ కంటే, చిన్ని కంటే కూడా మంచివాళ్ళు కాదు. నేనా స్కూల్లో చదవను."

"మరి నీతోపాటె చదువుకునే పిల్లలో ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"మన వీధిలో వెంకటయ్య, బెన్నీ, జాఫర్, పార్వతి - వీళ్ళే - మంచి వాళ్ళు, వాళ్ళకన్నా. అక్కడ అన్నీ అబద్ధాలు, అన్నీ ఎచ్చులు..."

"అందరూ మంచివాళ్ళే ఉండరు. మన మంచి ముఖ్యం" అన్నాను.

"అయితే ఆ స్కూలు అయితేనేం, మన వీధి బడి అయితేనేం?" అని చేతు ఎదురుప్రశ్న వేశాడు.

"ఇక్కడ అంత బాగా చెప్పరు కదా ?" అన్నాను ఆఖరు ప్రయత్నంగా.

"ఇంట్లో చదువుకుంటాను. అర్థం కాకపోతే మిమ్మల్ని అడుగుతాను."

నా దగ్గర సమాధానం లేదు. "సరే, అమ్మతో మాట్లాడతాలే" అన్నా. చేతు నావైపు అనుమానంగా చూశాడు.

మీనాక్షితో వివరంగా చర్చించాను. సచ్చీల విద్యా నికేతన్ చదువు మాన్పించడానికి మీనాక్షి ఒప్పుకోక తప్పలేదు:

ఉదయమే చేతుతో చెప్పాను - "ఇక్కడే చేర్పిస్తా" లెమ్మని. చెప్పిందే తడవుగా తలాడించి ఇంట్లోంచి తుర్రుమన్నాడు.

కిటికీలోంచి చూస్తుంటే...

మా ఇంటి కెదురుగా ఉండే ఖాళీ స్థలంలో చేతు పాతమిత్రుల మధ్య దేశవాళి క్రికెట్ చిల్లా కట్టె ఆడుతూ; హుషారుగా.

నాలుగు రోజుల తర్వాత కిటికీలోంచి చూస్తుంటే...

ఈసారి మా చిన్ని అపర్ణ మరో ఇద్దరు ఆడ పిల్లలతో కలసి తొక్కుడు బిళ్ళ ఆడుతూ ఆరుబయట సంధ్యా కాంతిలో ఆనందంగా...

"అయ్యో బృహదీశ్వరా !" అంటూ మా మీనా దగ్గరకు రాకపోవడం నాకేమీ ఆశ్చర్యంగా లేదిప్పుడు.

○ 2 అక్టోబరు 1988, ఆంధ్రజ్యోతి ఆదివారం.